# ర తేలుకొండి

రామచంద్రుడు "అనువులపల్లి" బోర్డు ఎలిమెంటరీ స్కూలు హెడ్డుమాస్టర్. కాని కాపురంవుండెది తన సొంతవూరైన "దిరిసెన పురం". బోర్డువారు ఇచ్చేజీతం నెలకు ఇరవైరూపాయలు. కాని పొలం మీద అతనికి వచ్చేరాబడి సాలికి రెండువందలు వస్తుంది. కాబట్టి నిర్విచారంగా గడప కల్గుతున్నాడు కాలం. రూల్సు ప్రకారం అనువులపల్లిలో వుండాలి కాపరం అతడు. కాని దిరిసెనపురంలో సొంతగృహం నాలుగిళ్ళ ఛవంతివుండడాన్నిబట్టీన్నీ, తనవూరికీఅనువులపల్లికీ మైలున్నరకంటె హెచ్చు దూరం లేకపోవడాన్ని బట్టీన్నీ, రోజూ సైముకువెళ్ళి సైముకుతనవూరు తిరిగివస్తూ పిల్లలకు చెప్పేచదువునందు ఏమరుపాటు లేకుండా శ్రద్ధగా చెప్తూవుంటాడు. అయినా ఇన్సపెక్టర్లు సర్ప్రైజువిసిట్సు చేస్తారనే భయం కొద్దీ ఓచిన్న గదీహాలూవసారా గల యిల్లు అనువులపల్లిలో అద్దెకు తీసికొని అక్కడ తాను కాపురం వుంటూన్నట్టు కనిపించేలాగు చెంబూ చేంతాడు. మానికగిన్ని పోలఅపుకోరా, బిందె బియ్యంకడుగుబుట్ట, మంచం కుంచం, పక్కాగిక్కా ఎప్పుడూ డుప్లికేటు సామానూ సరంజాం అమారుగా వుండజూచుకునేవాడు. కాని ఆఅద్దెకొంపలో నొక్కనాడూ వంటచేసుకోవడంగాని యింటావిణ్ణి తీసికొనివెళ్ళి వుంచడంగాని జరిగించి వుండలేదు.

ఈ చర్య అనుపులపల్లి వూళ్ళో ఓకొందరికి కంట్రకంగా వుండి, అథారిటీస్‌కు ఎనానిమస్ అర్జీకొట్టారు; ఫలానిమాష్టర్ తిన్నగా చదువు చెప్పడంలేదని, బరివున్న వూళ్ళో కాపురం వుండడంలేదని, నామకః ఓయిల్లు మాత్రం పుచ్చుకొని రోజూ తన సొంతవూరు పోతూవుంటాడని, కావలిస్తే యేలినవారు తనిఖీచేయవచ్చునని యిలా, రామచంద్రు డద్దెకు పుచ్చుకున్న యింటియొక్క వీధి, చూరు, మున్నగువాటి అనవాళ్ళతోసహా వివరంగా వ్రాశారు.

ఓ అయ్యర్, డి. ఇ. వో. ఆ రేంజీలో. అయ్యర్ అతి కరకట్టు మనిషి. "తూత్తుక్కుడి" నుంచి కొంపాగోడూ వదులుకొని "తుంగపాడు" దాకావచ్చి, వండుకున్న వూళ్ళో వండకుండా, ఆంధ్రమండలమంతా త్రిపాదిలా తాతిరుగుతూ వుంటే, ఈచిన్నబడిపంతులుక్కు ఈసుఖమేం? బరివున్న వూళ్ళో వుండకపోవడమేం?" అని ఆ ఆకాశరామన్న పితూరీ చూడ్డంతోనే అగ్గిలా ఆగ్రహస్థుడై తక్షణం కమాన్కు బయలుదేరేడు.

అయ్యర్ భార్య అశ్వద్ధమ్మాళ్. పిల్లాసీచూలేనిపడుచు. తాను కూడా భర్తవెంట వస్తానంటూ ప్రయాణంకట్టింది. అయ్యర్ తాను సర్ప్రైజు విజిట్టుకు పోతున్నానన్నాడు. ఎలావుంటుందో చూస్తాను తానున్నూ అని అన్నది అశ్వద్ధమ్మాళ్. కాదనలేక కూడా కారెక్కించుకుని అయ్యర్ ఓరేత్రి 12 గం॥కు అనుపులపల్లి చేరుకున్నాడు. ఎస్.డి.ఐ. లకు, జి. డి. ఐ. లకు కూడా తాఖీదు లంపలేదు. బంట్రోతునుకూడా తీసికొనిపోలేదు. నేరుగా అర్జీలో వివరించిన ఆనవాళ్లు చూచుకుంటూ అనుపులపల్లిగ్రామంలోని పైమాష్టర్ యొక్క అద్దెయింటికి చేరుకున్నాడు.

తలుపుమీదకు టార్చిలైటు వేసిచూచాడు. తలుపుకోతాళంలేదు సరికదా తలుపుమీద "మాస్టర్ రామచంద్రుడూస్ రెసిడెన్సు" అని వ్రా సి

వున్నది. తలుపుతోసి చూచాడు. ఎదర వో చూపు తడిక వ్రేలాడ దీయబడి అందుమీద 'వెల్‌కం' అని వ్రాసివుంది. "రామచంద్రుడూ! మాస్టర్!" అని పిలిచాడు అయ్యర్. ఎవ్వరూ పలకలేదు చూపు తడిక వొత్తిగించి చూచాడు. రెండు మంచాలమీద రెండు తెల్లని పక్కలు వేయబడి పదక్కి అమారుగా వుంచబడ్డట్టు కనిపించినయి. "రామచంద్రుడు ఎక్కడకో వెళ్ళివుంటాడు — అతని భార్య సిగ్గుచేత దాక్కొని వుండి వుంటుంది" అని అశ్వద్ధమ్మాళ్ భర్తతో అంది. అయ్యర్ "అయితే ఈ ఎనానిమస్ కంప్లైంటు అబద్ధపుదే అంటావా?" అన్నాడు. అశ్వద్ధమ్మాళ్ "మరింత తెల్లగా పక్కలు వేయబడి వుండడం చూస్తే మనుష్యులు ఇక్కడ కాపురం వుంటూవున్నట్టే తోస్తుంది" అంది. హాల్లో ఓమూల తగ్గించబడివున్న హరికేన్ లాంతరు దీపం హెచ్చిస్తూ అయ్యర్ ఓమంచంమీద కూర్చుని "అలా కూర్చో ఆమంచంమీద" అన్నాడు భార్యను.

ఆమె కూర్చోక "వంటిల్లు పరీక్షచేసిచూస్తే తెలిసిపోతుంది ఈమాస్టర్ యిక్కడ కాపరం వుంటూవున్నదీ లేనిదీ" అంది. అయ్యర్ "ఎట్లా?" అన్నాడు. అశ్వద్ధమ్మాళ్ "గిన్నెలకు మసీ గసీ వుండి గిన్నెల్లో మెతుకులువుంటే యీ పూట వండుకుని తిని మాస్టరూ మాస్టరు భార్యా ఎక్కడకో సర్‌ప్రైజు విజిట్సుకు మనలాగే వెళ్ళివుంటారు అని మనం నిర్ధారించవచ్చు. లేకుంటే ఇది అంతా బూటకం అని నిర్ధారించవచ్చు" అంది. "అయితే పరీక్షచేసి చూడు వంటిల్లు" అన్నాడు అయ్యర్. "ఇందుకా నన్ను తీసికొనివచ్చింది మీరు?" అని అంటూ నవ్వుకుంటూ, తక్కుకుంటూ, తారుకుంటూ, దొంగ దొరికాడురా అన్నట్టు, ఓగిన్నెచూస్తూ దానిమీది మూతయెత్తి అందులో చెయ్యిపెట్టి రాచింది.

టపీమని ఏదో అశ్వద్ధమ్మాళ్ వడింవేలికి కుట్టినట్టయి మంటెత్తిపోయింది. "బాబోయి" అని కెవ్వున అరిచింది. "ఎన్నా? ఎన్నా?" అని అరవాన్ని అయ్యర్ తనపెళ్ళాన్ని ప్రశ్నిస్తూ పెళ్ళాం వేలుకణుపు వద్ద తనవేలెట్టి విషమెక్కకుండా నొక్కుతూ "తేలా? జర్రా? పామా? మండ్రకప్పా?" అని ఊ గోలచేశాడు.

"చూడండిబాబూ! ఏదోను! కొరకంచు తగిల్చినట్టుంది. చుర్రు చుర్రు మంటూవుంది. బాబోయి!" అని ఊ బాధిల్లి దొడగింది.

అప్పటికెలా ఎక్కణ్ణుంచి వచ్చేదో రామచంద్రుడు మాస్టర్, అనువుల్లిల్లి లోని తన అద్దెయింటికి చేరుకుంటూ లోపలకువెళ్ళి "ఏమిటండీ యినస్పెక్టరుగారూ! ఇలా దయచేశారు?" అన్నాడు. ఇన్స్పెక్టర్ అయ్యర్వాళ్ "పాఠశాలలో వస్తుపాతానికిగాను సరఫరాకాబడ్డ తేళ్ళను వంటింట్లో జాగర్త పెట్టావేంటోయి! మాస్టరూ!" అన్నాడు. రామచంద్రుడు "బోర్డువారు సీసాలు అరఖులూ సరఫరా చేయకపోతే ఎక్కడ దాచమంటారు వీటిని? ఇలా దస్తాగిన్నెల్లో వడేసి మేం బయటతిరుగుతూ వుంటాం" అన్నాడు.

అశ్వద్ధమ్మాళ్ "మందో మాకో చూడ"మన్నట్టు వేలట్టు కూర్చుంది. మాస్టర్ 'తల్లీ తగ్గిపోతుందమ్మాబాధ' అని తేలుమంత్రం-

"ఓంనమో భగవతే—"ఉప్

'వీరభద్రాయ దక్షధ్వంసాయ'—దిగిందా తల్లీ!

'సురాసుర భయంకరాయ'— ఝూడించండమ్మా! చెయ్యి.

'భేతాళసంహారిణే'—ఇంకా ఘట్టిగా ఝూడించండమ్మా!

'ఏహీ ఏహీ'—ఈలా చూడండమ్మా!

'భస్మీకారు'—అయ్యర్ వాళ్ మీరు ఆమె వేలువదలండి."

'భస్మీన్ కురుభటుయిస్వాహా!" 'చల్లగా వుండాండి అమ్మా! యిప్పుడు' అన్నాడు. లోప్రాసినవన్నీ మాస్టర్ లోలోపలే అనుకుంటూ ఓటీపురుషల్లితో గీవాడు.

అశ్వాద్ధమ్మాళ్ తగ్గిందిఅంటూ చిరునవ్వు నవ్వింది. 'మాస్టర్ మహామంచివాడు' అంది. 'ఇంకా నాకు తల్లీ! పాపమంత్ర మొచ్చు, శాకినీ ఢాకినీ పిశాచినీ మంత్రాలన్నీ వచ్చు. కాని అవి పిల్లలకు చెప్ప నివ్వరు తల్లీ! చెప్పనివ్వరు!' అన్నాడు మాస్టర్.

ఇన్నపెద్దవయ్యరు కిమన్నాస్తి—

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 9-1-1931 | కోడమంచిలి | "వినోదిని"లో |